సాక్షి
విజయనగరం
గురువారం । 28 । డిసెంబర్ । 2023



ప్రధాన మంత్రితో మాట్లాడాలనుందా..? - 8లో

ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడే అవకాశం ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది.



ధాన్యం బిల్లులకు ఢోకా లేదు

ధాన్యం బిల్లులకు ఢోకా లేదని, సేకరించిన వారం రోజులలోపే రైతుల ఖాతాలకు జమవుతున్నాయని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. - 8లో



అర్బన్ పీహెచ్‌సీ నేడు ప్రారంభం

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో రూ.కోటి11లక్షల వ్యయంతో అర్బన్ పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయింది. - 8లో

న్యూస్‌రీల్

అంకిత భావంతో పనిచేయాలి

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం నూతనంగా విధుల్లో చేరిన వైద్యాధికారులకు విధులపై శిక్షణ ఇచ్చారు. సమయపాలన పాటించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి, ట్రస్టు బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయాన్ని బుధవారం అమ్మవారి కళ్యాణ మండపం ఆవరణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎల్.సుధారాణి మాట్లాడుతూ అమ్మవారి చదురుగుడిలో 28 రోజులకు హుండీల నుంచి రూ.11లక్షల98వేల985ల నగదు, 21 గ్రాముల 750 మిల్లీ గ్రాముల బంగారం, 228 గ్రాముల వెండి లభించాయన్నారు. వనంగుడిలో 56 రోజులకు హుండీల నుంచి రూ.6 లక్షల 57వేల 626ల నగదు లభించిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి నృత్యప్రతిభ



తల్లిదండ్రులతో చాందిని

బొబ్బిలి: పట్టణంలోని స్వామివారి వీధికి చెందిన రెడ్డి చాందిని గిన్నిస్‌బుక్‌లో చోటు సాధించింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 24న భారత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక భరతనాట్యంలో పాల్గొని నిర్విరామంగా నృత్యం చేసి ప్రశంసలు అందుకుంది. చిన్నారి నాట్యప్రతిభను గురువు కోనా రవి, తల్లిదండ్రులు రవీంద్ర, సంతోషి కుమారి మెచ్చుకున్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ



మాట్లాడుతున్న పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు

విజయనగరం క్రైమ్: ఎన్నికల విధులపై పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు కోరారు. పీటీసీ పరిధిలోని తొమ్మిది జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల విధులు, ఎఫ్ఎస్ఎల్ శిక్షణను ఆయన బుధవారం ప్రారంభించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 44 మంది ఇన్‌స్పెక్టర్లు ఎఫ్ఎస్ఎల్ కోర్స్‌కు హాజరుకాగా, 120 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో శిక్షణకు హాజరయ్యారు. ఈ నెల 30 వరకు కోర్సులు నిర్వహిస్తామన్నారు. ఎఫ్ఎస్ఎల్ కోర్సులో శాస్త్రీయమైన సాక్ష్యాల సేకరణ, భద్రపరచడం, నేరస్తులు తప్పించుకోకుండా చూడడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీలు సీహెచ్‌వీ రామారావు, వి.వి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఆసరా





ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు కె.రమ. ఈమెది గంట్యాడ మండలం బుడతానపల్లి. కొద్దిరోజుల కిందట ప్రసవం కోసం ఘోష ఆస్పత్రిలో చేరింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యులు ఉచిత వైద్యసేవలు అందించారు. అనంతరం ఆమెకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.5 వేలు ప్రభుత్వం అందించింది.



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు మూనురు నాయుడు. జామి మండలం రామయ్యపాలెం. మూడు నెలల కింద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రిలో ఉచిత శస్త్రచికిత్స జరిగింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినరోజు ఆయన ఖాతాకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద ప్రభుత్వం రూ.10 వేలు జమచేసింది.

• 2019 నుంచి 2023 నవంబర్ చివరినాటికి 1,42,987 మందికి లబ్ధి
• డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యపరీక్షలు
• రోగులు కోలుకునేవరకు ఆరోగ్య ఆసరా కింద ఆర్థిక భరోసా
• రూ.5 వేలు నుంచి రూ. 60వేల వరకు చెల్లింపు
• ఇప్పటివరకు రూ.62.52 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
• ఆరోగ్యశ్రీ ఆర్థిక పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంపు



విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

2019 నుంచి 2023 నవంబర్ నెలఖారు నాటికి ఆసరా లబ్ధి ఇలా...

సంవత్సరం	శస్త్రచికిత్సల సంఖ్య	ఆరోగ్య ఆసరా కింద చెల్లింపు
2019-20	11,249	రూ. 3.11 కోట్లు
2020-21	20,430	రూ. 7.56 కోట్లు
2021-22	39,545	రూ.12.53 కోట్లు
2022-23	40,540	రూ.23.1 కోట్లు
2023-24	31,223	రూ.16.22 కోట్లు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఊరూరా హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాలు, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, ప్రభుత్వాస్పత్రుల ఆధునీకీకరణతో మెరుగైన వైద్యసేవలను ఉచితంగా అందజేస్తోంది. ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. గతంలో ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్యం అందడమే గగనమయ్యేది. రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. ఇప్పుడు... ఆస్పత్రిలో చేరి వైద్య నివేదికలు అప్‌లోడ్ చేసిన వెంటనే వ్యాధి తీవ్రతను బట్టి ఉచిత వైద్యసేవలకు అనుమతులు జారీ చేస్తోంది. వైద్యం ఖర్చు పరిమితిని కూడా రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచింది. రోగులు కోలుకున్నాక ఆరోగ్య ఆసరా కింద ఆర్థిక భృతి చెల్లిస్తోంది. ఆరోగ్యశ్రీ పథకం చికిత్స చేసుకున్న వారు చికిత్సానంతరం ఎటువంటి పనులు చేసుకోలేరు. ఏ పనికి వెళ్లకపోవడం వల్ల వారు కుటుంబ పోషణకు ఇబ్బంది పడతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్దమనసుతో ఆరోగ్యశ్రీ ఆసరా కింద చికిత్సానంతర జీవనోపాధి భృతిని అందజేస్తోంది. శస్త్రచికిత్స చేసుకున్న తర్వాత త్వరగా కోలుకోవడానికి మంచి ఆహారం తీసుకోవడం కోసం భృతిని అందజేస్తూ ఆరోగ్య భరోసానిస్తోంది.

ఆర్థిక ఆసరా



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యసేవలు పొందిన రోగులు కోలుకునేవరకు ప్రభుత్వమే ఆరోగ్య ఆసరా కింద భృతి చెల్లిస్తోంది. రోగులు పౌష్టికాహారం తీసుకునేందుకు, త్వరగా కోలుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న గొప్పసాయం ఇది. చికిత్స అనంతరం భృతి చెల్లించడం దేశంలో ఒక్క ఏపీలోనే జరుగుతోంది.

– డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

భృతి చెల్లింపు ఇలా...

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 1536 వ్యాధులకు వైద్యసేవలు పొందిన రోగులకు ఆరోగ్య ఆసరా పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేస్తోంది. ఈ పథకంలో భాగంగా ఆపరేషన్ కోసం రోగిచేరిన వెంటనే రోగి బ్యాంకు ఖాతా నంబర్‌ను ఆరోగ్యమిత్ర రిజిస్టర్ చేస్తారు. డిశ్చార్జ్ అయిన తర్వాత రోగి బ్యాంకు అకౌంట్‌లో నేరుగా విశ్రాంతి భృతి జమవుతుంది. 2019–20 నుంచి 2023 నవంబర్ నెలఖారు నాటికి ఆరోగ్య ఆసరా కింద 1,42,987 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.62.52కోట్లు జమచేసింది.

3, 4 తేదీల్లో బాలోత్సవాలు



బ్రోచర్ విడుదల చేసిన డిప్యూటీ ఈఓ వాసుదేవరావు, విద్యార్థులు

విజయనగరం అర్బన్: వచ్చేనెల 3, 4 తేదీల్లో బాలోత్సవాల పేరుతో పాఠశాలల పిల్లలకు వివిధ కళాంశాల్లో పోటీలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఎస్.చలం, కె.శ్రీనివాసరావు తెలిపారు. గురజాడ అప్పారావు స్మారక నివాసంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను డిప్యూటీ ఈఓ వాసుదేవరావు చేతుల మీదుగా విడుదల చేశారు. కళాంశాలలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, మట్టితో బొమ్మల తయారీ, కథారచనలు, కథా పఠన, జానపద గీతాలు తదితర 13 కళాంశాలలో జూనియర్, సీనియర్ కేటగిరీలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం సెల్: 94904 99147, 94901 06390 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పి.సత్యవతి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎస్.ఎస్.ఎస్.ఎస్.రాజు, చైర్మన్ ధవళ సర్వేశ్వరరావు, సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, సూర్యలక్ష్మి, గురజాడ వారసులు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..



విజయనగరం జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు బుధవారం జిల్లాలోని 27 మండలాలు, నాలుగు పట్టణాల్లోని 437 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఐదు క్రీడాంశాలకు సంబంధించి 601 మ్యాచ్‌లు జరిగాయి. కలెక్టర్ నాగలక్ష్మి, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో పర్యటించి క్రీడా పోటీలను పర్యవేక్షించారు. ఆటల్లో తలపడుతున్న క్రీడాకారులను ప్రోత్సహించారు.

– విజయనగరం

12లోగా అభ్యంతరాల పరిష్కారం

• కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా అభ్యంతరాలను పరిష్కరించేందుకు ఎన్నికల కమిషన్ వచ్చేనెల 12వరకు గడువు పెంచిందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తుది ఓటరు జాబితాను జనవరి 5న కాకుండా 22న విడుదల చేస్తామని చెప్పారు. బీఎల్‌ఓలు మరోసారి చేర్పులు, తొలగింపుల దరఖాస్తులను తనిఖీ చేయాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఈవీఎం గొడౌన్ తనిఖీ ఉంటుందని, రాజకీయ పార్టీల ప్రతినిధులంతా హాజరుకావాలని కలెక్టర్ కోరారు. బూత్ స్థాయిలో స్వీప్ కార్యక్రమాలు జరపాలని, ఈవీఎంల డెమో నిర్వహించాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుధారాణి, సుదర్శన దొర, నూకరాజు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు రొంగలి పోతన్న, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి మంత్రి బొత్స జిల్లా పర్యటన

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గుర్ల మండలం కొండగండ్రేడు చేరుకొని గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్ర భవనాలను, తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారు. ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు రామలింగాపురం చేరుకొని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, సొసైటీ గొడౌన్, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్ర భవనాలను ప్రారంభించి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 29న ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు గరివిడి మండలం వెదుళ్లవలసలో బీటీరోడ్డు ప్రారంభం, విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 30న మెరకముడిదాం మండలం శాతంవలసలో పెరుమాలి వరకు నిర్మించిన రోడ్డును, రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగసభలో పాల్గొంటారు. 31న ఉదయం 10.30 గంటలకు బొబ్బిలి మండలం పక్కిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విజయనగరం చేరుకుంటారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సర్వం సిద్ధం

• పి.కోనవలసలో నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడా సంబరం
• పోటీలను ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
• మూడురోజుల పాటు సాగనున్న పోటీలు
• 18 విభాగాల్లో తలపడనున్న 1400 మంది క్రీడాకారులు



రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడేందుకు పి.కోనవలస చేరుకుంటున్న క్రీడాకారులు



పోటీలకు ముస్తాబైన క్రీడా మైదానం

సాలూరు: గిరిజన గురుకుల విద్యాలయాల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు పాచిపెంట మండలం పి.కోనవలస గురుకుల విద్యాలయం ముస్తాబైంది. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర పోటీలను గురువారం ప్రారంభించనున్నారు. మూడురోజుల పాటు (శనివారం వరకు) గిరిజన గురుకుల విద్యాలయాల అండర్–17,19 విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. బాలురు, బాలికలు కలిపి సుమారు 1400 మంది క్రీడాకారులు పాల్గొనే రాష్ట్రస్థాయి పోటీలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా క్రీడాధికారులు, పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ పర్యవేక్షణలో పోటీలు సాగనున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు అవసరమైన వసతి, భోజన ఏర్పాట్లను పూర్తి చేశారు. పోటీలకు రాష్ట్రంలోని 40 గిరిజన గురుకుల కళాశాలలు, 85 పాఠశాలల నుంచి క్రీడాకారులు తరలివస్తున్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, ఆర్చరీ, చెస్, లాంగ్‌జంప్ తదితర 18 విభాగాల్లో పోటీలు సాగునున్నాయి.

తప్పుడు వార్తలను నమ్మొద్దు

చీపురుపల్లిరూరల్ (గరివిడి):

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన వలంటీర్స్ వ్యవస్థపై కొన్ని పత్రికలు, చానళ్లు, సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతోందని, వాటిని నమ్మొద్దని వలంటీర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్ల సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వలంటీర్లు ఏ రకమైన ధర్నాలు, ఆందోళనలు చేయడంలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చిన వలంటీర్ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఈ వ్యవస్థ వల్ల జరుగుతున్న మంచిని జీర్ణించుకోలేని కొన్ని రాజకీయ పార్టీలు ఇలాంటి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. వలంటీర్లు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నారని, విధులు బహిష్కరిస్తున్నారని వస్తున్న వార్తలు అవాస్తవమని, ఆ వార్తలు నిరాధారమైనవని పేర్కొన్నారు.

కూలి బతుకుల్లో... విషాదం

• వరిచేను నూర్పిడి యంత్రం కింద నలిగిన కూలీలు
• ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు
• తెర్లాం మండలం అంట్లవారలో విషాదం
• శోకసంద్రంలో మృతుల కుటుంబాలు



గంట రమణమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్లో) రమణమ్మ (ఫైల్)



ప్రమాదంలో మృతి చెందిన భీమసింగి శాంతి, (ఇన్‌సెట్లో) శాంతి (ఫైల్)



ప్రమాదానికి కారణమైన వరిచేను నూర్పిడి యంత్రం



గాయపడిన మహిళలను 108 వాహనంలో రాజాం సీహెచ్‌సీకి తరలిస్తున్న దృశ్యం

తెర్లాం: వరి కోతలు పూర్తయ్యాయి. నూర్పిడి పనులు జోరుగా సాగుతున్నాయి. సీజన్‌వారీగా లభించే పనుల సమయంలోనే కుటుంబనావను నడిపించేందుకు అవసరమైన డబ్బులు సంపాదించాలన్న తాపత్రయం వారిది. ఓ వైపు చలి వణికిస్తున్నా ఎప్పటివలే వేకువజామునే పనిలోకి వెళ్లారు. వరి నూర్పిడిని పూర్తిచేసి తిరుగుప్రయాణమయ్యారు. మరికొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకుందామనుకున్న సమయంలో ఒక్క ఉదుటున కుదుపు. వారికి ఉపాధికల్పించిన నూర్పిడియంత్రం క్షణాల్లో బోల్తాపడింది. ఇద్దరు కూలీలు యంత్రం కింద నలిగిపోయి హాహాకారాలు చేస్తూ ప్రాణాలు విడవగా, మరో ఐదుగురు గాయపడి ఆస్పత్రిపాలయ్యారు. తెర్లాం మండలం అంట్లవార గ్రామంలో బుధవారం ఉదయం జరిగిన ప్రమాదం మృతుల కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అంట్లవార గ్రామానికి చెందిన 9 మంది మహిళా కూలీలు వరిచేను నూర్పిడి పనులకు వేకువజామునే వెళ్లారు. వరిచేను నూర్పిడి పూర్తికావడంతో నూర్పిడియంత్రంపై ఇరువైపులా ఉన్న స్టాండ్స్‌పై కూర్చొన్నారు. పొలం నుంచి కొద్ది దూరం వచ్చేసరికి నూర్పిడియంత్రం అదుపుతప్పి బోల్తాకొట్టింది. ప్రమాదంలో గంట రమణమ్మ (40), భీమసింగి శాంతి(38) అక్కడికక్కడే మృతి చెందారు. బోను లక్ష్మి, ఈదుబిల్లి వరాలమ్మ, గొంగాడ ఆదిలక్ష్మి, మూడడ్ల లక్ష్మి, కోట సత్యవతికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రథమ చికిత్స నిమిత్తం తెర్లాం పీహెచ్‌సీకి అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజాంలోని కేర్ ఆస్పత్రికి కొందరిని, రాజాం సీహెచ్‌సీకి మరికొందరిని 108లో తరలించారు. గ్రామస్తుల సమాచారం మేరకు తెర్లాం ఎస్‌ఐ ఆర్.రమేష్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాలకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

కాటేసిన మృత్యువు

కష్టపడుతూ కుటుంబాన్ని పోషిస్తున్న కూలీలను మృత్యువు కాటేయడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటిపర్యంతమవుతున్నారు. మృతురాలు గంట రమణమ్మకు భర్త ధనంజయ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు మణికంఠ బొబ్బిలిలోని ఓ ప్రైవేటు ఐటీసీలో ఐటీఐ చదువుతుండగా, కుమార్తె హరిప్రియ నందిగాం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఇదే ప్రమాదంలో మృతి చెందిన భీమసింగి శాంతికి భర్త సంగమేష్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె స్నేహ శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలో చదువుతుండగా, కుమారుడు మణి నందిగాం హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లుల మృతదేహాలపై పడి పిల్లలు విలపించడం అక్కడివారిని కన్నీరుపెట్టించింది.

మృతులిద్దరివీ పక్కపక్కన ఇళ్లే...

నూర్పిడియంత్రం బోల్తాపడి మృతిచెందిన ఇద్దరు మహిళా కూలీలది పక్కపక్కన ఇళ్లే. నిత్యం అన్యోన్యంగా ఉండే రవణమ్మ, శాంతిలిద్దరూ ఒకేసారి మృత్యుఒడిలోకి వెళ్లడంతో గ్రామస్తులు కంటతడి పెడుతున్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్‌లో గరికపేట విద్యార్థి ప్రతిభ



కాంస్య పతకాన్ని చూపిస్తున్న ప్రవీణ్ కుమార్

నెల్లిమర్ల రూరల్: ఈ నెల 25 నుంచి రాజస్థాన్ వేదికగా జరుగుతున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని గరికపేట గ్రామానికి చెందిన సీర ప్రవీణ్ కుమార్ కాంస్య పతకం సాధించాడు. అండర్ -19 విభాగంలో 55 కిలోల విభాగంలో పాల్గొని స్నాచ్ 83 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 105 కిలోలు..మొత్తంగా 188 కిలోల బరువును ఎత్తి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

11 మద్యం బాటిల్స్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిల్స్

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బాటిల్స్‌ను, నిందితుడిని పట్టుకుని, కేసునమోదుచేసినట్టు ఎస్సై ఇ.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ దాడిలో 11 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి, కోర్టుకు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాలూరులో 80మద్యం సీసాలు..

సాలూరు: అక్రమంగా మద్యంసీసాలు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కోటవీధి జంక్షన్ వద్ద వాహనతనిఖీలు చేపడుతుండగా, మక్కువ నుంచి సాలూరుకు ద్విచక్రవాహనంపై వస్తున్న దత్తివలసకు చెందిన చప్పల ప్రసాద్‌ను తనిఖీ చేయగా 80 మద్యం బాటిల్స్ కలిగి ఉన్నట్లు గుర్తించి బైక్‌ను, బాటిల్స్ సీజ్ చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేశామన్నారు.

వీడీఆర్ఎల్ ల్యాబ్ పరిశీలన



వైద్యులతో చర్చిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: మిమ్స్ ఆస్పత్రిలో ఉన్న వీడీఆర్ఎల్ ల్యాబ్‌ను డీఎంహెచ్ఓ భాస్కరరావు బుధవారం పరిశీలించారు. కోవిడ్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో పరీక్షలు చేయడానికి ఎటువంటి ఏర్పాట్లు చేయాల్సి ఉందో పరిశీలించడానికి వచ్చినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. పరీక్షలు చేయడానికి పరికరాలు, సిబ్బంది తదితర అంశాలపై అక్కడి వైద్యులతో చర్చించారు.

మూడువేల లీటర్ల సారా ధ్వంసం



సారాను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: పట్టణ శివారులో మూడు వేల లీటర్ల సారాను బుధవారం ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 31 వరకు పట్టుబడిన 26 కేసుల్లో సీజ్ చేసిన 3000 లీటర్ల నాటుసారాను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లస్టర్ విధానం వద్దు

విజయనగరం ఫోర్ట్: పశు సంవర్ధకశాఖలో క్లస్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టేందుకు చేస్తున్న సన్నాహాలకు స్వస్తి పలకాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ చైర్మన్ పోలా గోవిందరావు కోరారు. ఈ మేరకు స్థానిక పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధకశాఖలో క్లస్టర్ విధానం వల్ల వివిధ హోదాల్లో పనిచేస్తున్న పారావెట్స్ హోదా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఆదినారాయణ, తారకేశ్వర్రావు, ధర్మతేజ, పిల్లా రామకృష్ణ, ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

ప్రధాన మంత్రితో మాట్లాడాలనుందా..?

- 6 నుంచి 12 క్లాస్ విద్యార్థులు.
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవకాశం

సీతంపేట: ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడాలనుకుంటున్నారా? అయితే ఆ అవకాశం ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది. మీరు చేయాల్సిందల్లా ప్రధాన మంత్రి పరీక్ష పే చర్చ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు కావాల్సి ఉంది. ఏటా పబ్లిక్ పరీక్షల ముందు పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని కేంద్రం నిర్వహిస్తోంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ ఇప్పటి వరకు 6 వ ఎడిషన్‌ను పూర్తి చేసుకుంది. ఇప్పుడు 7వ ఎడిషన్ నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా దేశ వ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేరుగా సంభాషించనున్నారు. పరీక్షలను సమర్థంగా, ఒత్తిడి లేకుండా ఎదుర్కోవడం, చిరునవ్వుతో ప్రశ్నలకు సమాధానాలు రాసేలా ప్రోత్సహించనున్నారు. విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని తొలగించేందుకు ప్రధానంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదుకు జనవరి 12వరకు గడువు

పరీక్షల సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలి? ఎదుర్కొనే సవాళ్లు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి? వారి ఆకాంక్షలు ఏమిటి ? వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలేమిటి? పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఎలా ఉండాలి? ఇలా పలు అంశాలపై పరీక్షాపే చర్చ కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమంలో పాల్గొనేందుకు 6 నుంచి 12 తరగతులు చదివే విద్యార్థులు అర్హులు. విద్యార్థులు తమ ప్రశ్నను ప్రధానమంత్రిని నేరుగా అడగవచ్చు. ప్రశ్న గరిష్టంగా 500 అక్షరాల లోపు ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పరీక్షా పే చర్చలో పాల్గొనవచ్చు. వారి ఎంట్రీలను కూడా ఆన్‌లైన్‌లో పంపే అవకాశాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కల్పించింది.



పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

విజేతలుగా నిలిస్తే..

పరీక్షా పే చర్చ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారు నేరుగా ప్రధాన మంత్రిని కలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి విజేతకు కిట్, ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నారు. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి ఆటోగ్రాఫ్, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్‌ను పొందే అవకాశం ఉంది.

లాగిన్ ఇలా అవ్వాలి

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హెచ్‌టీపీపీఎస్// ఐఎస్ఎస్‌వో వీఎటీఇండియా.మైజీవోవీ.ఇన్ లింక్‌ను క్లిక్ చేసి, మొబైల్ నంబర్ లేదా జీ మెయిల్ ఖాతాను పూర్తి చేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ అవ్వాలి. విద్యార్థులు/ ఉపాధ్యాయులు/తల్లిదండ్రులు ప్రాథమిక వివరాలను పూర్తి చేయాలి. కార్యాచరణ వివరాలను పూర్తి చేసిన తర్వాత థీమ్‌ను ఎంచుకుని 1,500 అక్షరాల లోపు వివరించాలి. పరీక్షా పే చర్చలో ఎంపికైన సుమారు 2050 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యామంత్రిత్వశాఖ పీపీసీ కిట్‌లను బహుమతిగా అందజేయనున్నారు.

అందరికీ మంచి అవకాశం



పరీక్షా పే చర్చ కార్యక్రమం మంచి అవకాశం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి. పరీక్షలంటే భయం పోగొట్టుకునేందుకు ఇదో మంచి తరుణం. జాతీయస్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు వచ్చేలా చూడాలి.

–ఎన్.ప్రేమ్‌కుమార్, డీఈవో

ఆరు రోడ్లకు అటవీ అనుమతులు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఆరు రోడ్లకు జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ అనుమతులు ఇచ్చిందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖలతో ఆయన సమావేశం నిర్వహించి కమిటీ ఇచ్చిన నివేదికలను పరిశీలించారు. ఆయా గ్రామాలను ప్రధాన స్రవంతిలోకి అనుసంధానించడానికి, గిరిజనులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడానికి ప్రాముఖ్యత దృష్ట్యా రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతి ఇవ్వగా, ఆరు రోడ్ల నిర్మాణం కోసం గిరిజన సంక్షేమశాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రతిపాదనలు సమర్పించారు. నిర్ణీత సమయంలో ప్రతిపాదనలను క్లియర్ చేయడంలో కృషిచేసినందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అధికారులను అభినందించారు. అటవీ శాఖ కమిటీ సభ్యుడు పాచిపెంట జెడ్పీటీసీ కె.సింహాచలం మాట్లాడుతూ జిల్లా కొత్తగా ఏర్పడడం, కలెక్టర్ నేతృత్వంలో అటవీ అనుమతులు సకాలంలో జారీచేయడంతో పాచిపెంట మండలంలో దాదాపు అన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణం జరుగుతోందని, గ్రామాలలోని సమస్యలు పరిష్కారమయ్యాయని సంతోషం వెలిబుచ్చారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జిల్లా అటవీశాఖాధికారి జీపీఏ ప్రసూన, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ జె.శాంతీశ్వరరావు, ఐటీడీఏ ఏపీఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

28,29తేదీల్లో అవంతిలో మెగా జాబ్ మేళా

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 28, 29 తేదీల్లో 1800 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, ఫార్మా, మాన్యుఫాక్చరింగ్, రిటైల్, ఆటోమొబైల్, మార్కెటింగ్, బ్యాంకింగ్, బీపీవో సెక్టార్స్‌కు సంబంధించిన 40 కంపెనీలు పాల్గొంటాయని తెలియజేశారు. నిరుద్యోగ యువతీయువకులు ఏపీ స్కిల్ యూనివర్స్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిన్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు కూడా అవకాశం ఉందని చెప్పారు. టెక్ మహీంద్రా, టెక్ విజన్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్, బి డేటా టెక్నాలజీ, రోవర్ ఐటీ టెక్నాలజీ, చందూ సాఫ్ట్ టెక్నాలజీ, డాక్టర్ రెడ్డీస్, హెటిరో డ్రగ్స్, స్మైలెక్స్ ల్యాబొరేటరీస్, డెక్కన్‌ఫైన్ కెమికల్, అరబిందో, లీ ఫార్మా, అపోలో ఫార్మసీ, సెయింట్ గోబియన్, యొకోహామా టైర్స్, సినర్జీస్, కాస్టింగ్స్, జయభేరి ఆటోమోటివ్స్, లక్ష్మి హ్యుండయ్, ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం, ఫ్లిప్‌కార్ట్, నవత రోడ్‌ట్రాన్స్‌పోర్ట్, నోవెల్ పేటెంట్ సర్వీసెస్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్‌తో పాటు మరిన్ని కంపెనీలు పాల్గొంటాయని ఎమ్మెల్యే వివరించారు. సెయింట్ గోబియన్‌లో డిప్లమో పాస్ లేదా ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులకు కూడా జాబ్‌మేళాలో అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8555868681, 9948768778 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ధాన్యం బిల్లులకు ఢోకా లేదు

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రామభద్రపురం: రైతుల వద్ద ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం బిల్లులకు ఢోకా లేదని,సేకరించిన వారం రోజులలోపే రైతుల ఖాతాలకు జమ అవుతున్నాయని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. రామభద్రపురం వచ్చిన సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి బిల్లులు చెల్లించేందుకు రూ.81 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 1,00,750 టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, అంతకు మరో మూడింతలు సేకరణ చేయవచ్చన్నారు. రైతులు దళారుల మాయలో పడి మోసపోకూడదని,కనీస మద్దతు ధర లభించాలన్న ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, మండల ప్రత్యేకాధికారి ఎస్.గోవిందరావు, ఎంపీడీవో రమామణి, తహసీల్దార్ సులోచనరాణి, పీడీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడల పరిశీలన

ఆడుదాం ఆంధ్రా క్రీడల పరిశీలకు రామభద్రపురం వచ్చిన సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక ఉన్నత పాఠశాలలో టెంట్‌లు,ఆర్చ్ తదితర సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు జేసీ నిర్వహించిన కాన్ఫరెన్స్‌ను ఎంపీడీవో, కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. షెడ్యూల్ ప్రకారం క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. క్రీడాకారులకు, వచ్చిన ప్రేక్షకులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రీడా ప్రాంగణంలో మార్పులు చేసినట్లయితే రెండు రోజుల ముందుగా క్రీడాకారులకు తెలియజేయాలని ఎంపీడీవోకు సూచించారు. ఏ రోజుకారోజు క్రీడలను సకాలంలో అప్‌డేట్ చేయాలని తెలిపారు. తప్పనిసరిగా స్కోర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవలసి ఉంటుందని హెచ్చరించారు.

ఆడుదాం-ఆంధ్రా పోటీలకు నిధులు

- ఒక్కో సచివాలయానికి రూ.10వేలు విడుదల

విజయనగరం:

ఓవైపు ప్రతిభ గల క్రీడాణిముత్యాలను వెలికితీయడంతో పాటు మరో వైపు ఆరోగ్యకరమైన సమాజమే ధ్యేయంగా 46 రోజుల పాటు నిర్వహించతలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు నిధులు విడుదలయ్యాయి. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. జిల్లాలోని 626 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒక్కో సచివాలయం పరిధిలో పోటీల నిర్వహణ ఖర్చుల కోసం రూ.10వేలు వంతున రూ.62.60 లక్షలు జిల్లాలోని ఆయా సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని 530 సచివాలయాలకు రూ.53 లక్షలు, 96 పట్టణ ప్రాంత వార్డు సచివాలయాలకు రూ.9.60 లక్షలు విడుదలైనట్లు పేర్కొన్నారు. ఈ నిధులను వినియోగించి పోటీల నిర్వహణకు ఆయా క్రీడా మైదానాల వద్ద పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్‌లు, మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు

విద్యుత్ ఉద్యోగులకు ఎస్ఈ అభినందన

విజయనగరం: ఓ వైపు విధి నిర్వహణతో పాటు మరో వైపు ఆసక్తి కలిగిన క్రీడా రంగంలో రాణిస్తున్న విద్యుత్ ఉద్యోగులను ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు అభినందించారు. ఈనెల 24,25 తేదీల్లో ప్రకాశం జిల్లా రామయ్యపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన రికార్డ్ అసిస్టెంట్ పి.పైడిరాజు 5000 మీటర్ల వాకింగ్ పోటీల్లో బంగారు పతకం, 400 మీటర్ల పరుగు పోటీలో సిల్వర్ పతకం, 400 రిలే పోటీలో మరో సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు. అదేవిధంగా ఆలిండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించే సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ఎస్‌కోట సెక్షన్ పరిధిలోని గ్రేడ్-2 జేఎల్ఎం పి.మణిబాబు, పైడిరాజులను ఎస్ఈ లక్ష్మణరావు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల గేమ్స్ ప్రధాన కార్యదర్శి పూడిహరి, గేమ్స్ కార్యదర్శి వి.మోహనబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.అప్పలసూరి, ఏడీఈ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో రాణిస్తున్న విద్యుత్ ఉద్యోగులను అభినందిస్తున్న ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు

వ్యాన్ బోల్తా పడి 10 ఆవుల మృతి



బోల్తాపడిన వ్యాన్



మరణించిన ఆవులు

సాలూరు: ఒడిశా రాష్ట్రంలోని సిమిలిగుడ నుంచి మానాపురం సంతకు సుమారు 40 ఆవులతో వెళ్తున్న గూడ్స్ వ్యాన్ బుధవారం సాలూరు బైపాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో 10 ఆవులు మరణించాయని, మరికొన్ని ఆవులకు గాయాలయ్యాయని పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, క్లీనర్ గాసిహరిజన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

డీసీసీబీ బ్రాంచ్ సేవలు

భోగాపురం: మండలంలోని సవరవిల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచ్‌ను (భోగాపురం బ్రాంచ్) ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ బ్రాంచ్ ద్వారా పంటలు, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, పట్నా తాతయ్యలు, పడాల భానుప్రకాశ్, సుందర హరీష్, తదితరులు పాల్గొన్నారు.



సవరవిల్లిలో ఏర్పాటు చేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

బైక్ ఢీకొట్టి వివాహిత మృతి

సాలూరు: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన వివాహిత బి.గౌరి(60) బైక్ ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈ సంఘటనపై పట్టణ సీఐ శ్రీనివాస రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటిలోని చెత్తను రోడ్డు అవతల వేసేందుకు గౌరి వెళ్లిన సమయంలో, సాలూరు నుంచి గుర్రాపువలస వైపు వెళ్తున్న వాహన చోదకుడు సూరిబాబు ఢీకొట్టాడు. బైక్ ఢీకొట్టిన వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లిన గౌరిని విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సూరిబాబును అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు.



మరణించిన గౌరి

పైడితల్లి అమ్మవారి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న, ఆలయ ఈఓ సుధారాణి, ట్రస్టు బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి క్యాలెండర్‌ను పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపంలో ఆలయ ఈఓ కేఎల్ సుధారాణి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ముఖచిత్రంతో కూడిన క్యాలెండర్‌ను భక్తులకు ఉచితంగా అందజేసేందుకు చదురుగుడి, వనంగుడిలో అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. అవకాశం ఉన్న భక్తులు అమ్మవారి క్యాలెండర్‌ను ఉచితంగా తీసుకువెళ్లవచ్చని సూచించారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్టు బోర్డుసభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ పీహెచ్‌సీ నేడు ప్రారంభం


- హాజరు కానున్న ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో అర్బన్ పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయింది. నగర పంచాయతీ ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారమైంది. ప్రజారోగ్యానికి సంబంధించి అర్బన్ పీహెచ్‌సీని జరజాపుపేటలో రెండేళ్లక్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటికే అక్కడి ప్రజలకు సేవలు అందుతున్నాయి. ఇక్కడ ఆపరేషన్‌థియేటర్, 10 బెడ్లు, మందుల షాపు, ఓపీ కౌంటర్, ఎమర్జెన్సీల్యాబ్, మీటింగ్ హాల్‌తో పాటు ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారు. అలాగే రోజుకో స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు అందిస్తున్నారు. దీంతో నగర పంచాయతీ ప్రజలతో పాటు మొయిద విజయరాంపురం, పూతికపేట, కొండగుంపాం, గరికపేట, పారసాం, చంద్రంపేట, టెక్కలి, చినబూరాడపేట, పెద బూరాడపేట తదితర గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఈ పీహెచ్‌సీ ఉంది. ఈ అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1 కోటీ 11లక్షల70వేలు మంజూరు చేసింది. అతి తక్కువ సమయంలో నిర్మాణం పూర్తికావడంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు గురువారం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబుతో, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.



జరజాపుపేటలో ప్రారంభించనున్న అర్బన్ పీహెచ్‌సీ

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



నగర పంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. నగర పంచాయతీ ప్రజలకు ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనివల్ల నగర పంచాయతీతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. మాకు ఇన్ని సదుపాయాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–బంగారు సరోజిని, చైర్‌పర్సన్, నెల్లిమర్ల నగర పంచాయతీ

ప్రజల ఆకాంక్ష నెరవేరింది

అర్బన్ పీహెచ్‌సీని ఏర్పాటు చేసిన రెండేళ్లలో ప్రభుత్వం చొరవతీసుకుని రూ.కోటి 11లక్షల నిధులతో ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసింది. నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు తీసుకున్న చొరవ మరువలేనిది. నగర పంచాయతీ ప్రజల ఆకాంక్ష నెరవేరింది.

–చిక్కాల సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నెల్లిమర్ల నగర పంచాయతీ

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Single Sitting : 10th, 12th, BA, B.Com, B.Sc, MA, MCom, MSc, MBA, BBA, BCA BTECH, DIPLOMA, AGRICULTURE, PHARMACY, NURSING (for drop outs/ Backlogs) from UGC recognised Universities CALL : FCC: 1800-570-3344 [R-221]

■ డైరెక్ట్ 10th, One Sitting Inter, B.A, Degree, PG, BBA, BCA, MBA, MCA, Diploma, B.Tech, M.Tech, D.Pharma, B.Pharma, B.SC (Arg), B.SC (Nursing), BEd, BL, Ph.D Eligible for All Govt Jobs, Futhier Studies and Abroad. Ph : 83417 74299 [V- 796960]

PLOT FOR SALE

■ కొన్నవారికి లాభాలను సంపాదించిపెట్టే శ్రీగంధం 100 గజాల ప్లాట్‌లను 4 లక్షలతో కొనిపించడం ద్వారా అదనపు ఆదాయం సంపాదించుకొనుటకు కస్టమర్ దేవుళ్ళు పెట్టుబడిదారులు కావలెను. ఫోన్: 63001 72408 [V-2325]

COMM.. HOUSE FOR SALE

■ VZM, పాలిస్టర్ హౌస్ ప్రక్క సందులో 133 గజాలలో నిర్మించిన 2 Floor (G+1) 2275 Sft గల కమర్షియల్ బిల్డింగ్ అమ్మకంనకు కలదు. డైరెక్ట్ పార్టీస్ సంప్రదించండి : 97032 36789 [V-1785]

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సిటీకాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367. [T-222]

WANTED

■ విజయనగరంలో గంటస్తంభం దరి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు కావలెను. Contact: 9573522221 [S-1260502]

■ వైజాగ్‌లో గల ప్రముఖ షాపింగ్‌మాల్స్‌లో పనిచేయుటకు 19-35 వయస్సు గల యువకులు కావలెను. జీతం : 10,000/- to 14,000/- + ఫుడ్, రూమ్, ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం కలదు. ఫోన్: 97046 37370, 99499 04532. ఫీజు లేదు. [V-26463]

■ హైదరాబాద్‌లోని అప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Caretakers కావలెను.జీతం:18-20వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్సు కలవు. 9381848549 [G-1624]

■ కష్టమైన్లే కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000 -40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. 7993583999 [HA-1036]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం జీ.18K.ఫోన్: 9640258899/9640468899. [HA-1041]

■ క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌లు, క్లాసు ఇన్‌ఛార్జ్‌లు, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌లు, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతం: 10,000/- నుండి 20,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనం, వసతి కల్పించబడును) విద్యార్హతలు: Inter Above, వయస్సు: 21+ పనిచేయు స్థలం: మాస్టర్ మైండ్స్, గుంటూరు. ఫోన్ 92484 45628 [G-4929]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.